# 2 సామర్థ్యాలు - అభ్యాసాలు - అవగాహన

© SCERT not to be republished

భాష మీద తన పట్టును పెంపొందించుకోవడానికి విద్యార్థికి పాఠశాల స్థాయిలో ఉపయోగపడే ప్రధానోపకరణం పాఠ్యపుస్తకం. పిల్లవాడు తన ఇంటిదగ్గరే నేర్చుకొని వచ్చిన మాతృభాషలో ఉన్న మెలకువలను, భాషాప్రయోగాలను, అంతర్భావాలను తదితర విషయాలను లేఖనసంప్రదాయంలో ఉన్నతంగా అందించే ప్రయత్నం చేస్తు,పాఠ్యపుస్తకం. నిత్యవ్యవహారానికి సంబంధించిన భాషనంతా ఇంటి వాతావరణమే అందిస్తుంది.

నూతన పాఠ్యపుస్తకాలు, భాషాపరంగా, సాహిత్యపరంగా విద్యార్థికుండే సామర్థ్యాలను వెలికితీసేరకంగా ఉన్నాయి. ఆయా తరగతుల్లో పాఠ్యపుస్తకాన్ని చదివాడంటే పిల్లవాడు ఏం నేర్చుకున్నట్లు, అనేది ప్రధాన ప్రశ్న. బట్టీ ద్వారా ప్రశ్నలకు జవాబులు రాసి ఉత్తీర్ణతాపత్రాన్ని పొందడం సరైనవిద్యా? దాని ద్వారా సామర్థ్యాలను సాధించడం జరుగుతున్నదా? అనేవి మనలను వేధించే ప్రశ్నలు.

అందుకే RTE 2009 ప్రతి విద్యార్థికీ సామర్థ్యాల సాధననే కొలబద్దగా నిర్ణయించింది. దాని ఆధారంగా APSCF-2011 విద్యాప్రమాణాలను నిర్దేశించింది. ఈ విద్యాప్రమాణాల కనుగుణంగా ఉన్న సామర్థ్యాలను పాఠ్యపుస్తకంలోని అభ్యాసాల ద్వారా కూర్చారు.

1. *ఎనిమిదో, తొమ్మిదో తరగతులకు నిర్దేశించుకున్న సామర్థ్యాలేవి?*
2. *వీటి సాధనకు పాఠ్యపుస్తకాలలో చేపట్టిన చర్యలు ఏవి?*
3. *అభ్యాసాల స్వభావాలు ఎలా ఉన్నాయి?*
4. *వీటిని ఎలా నిర్వహించాలి?*

ఒక్కో పాఠం పూర్తిగా బోధించడం అంటే ఆయా సామర్థ్యాల సాధన పూర్తవటం అని అర్థం. ప్రతి పాఠంలో ఉండే అభ్యాసాలను **“ఇవి చేయండి”** అనే శీర్షిక కింద ఇవ్వడం జరిగింది. ఈ అభ్యాసాలు వివిధ సామర్థ్యాల సాధనకు అనుకూలంగా ఉన్నాయి. పాఠ్యాంశ బోధనలో గరిష్ఠకాలం సామర్థ్యాల సాధనకే ఉపయోగించాల్సి ఉంటుంది. విద్యార్థి తన సామర్థ్యాలను సాధించడంలో ఉపాధ్యాయుడు మార్గదర్శి కావాలి.

**“ఇవి చేయండి”** అనే శీర్షికకింద ఇచ్చి సామర్థ్యాలకు సంబంధించిన అభ్యాసాల వివరణ, వాటికున్న ప్రాధాన్యం, వాటి ఆవశ్యకతలను ఉపాధ్యాయుడు తప్పక తెలుసుకోవాల్సిన అంశాలు. గుర్తించాల్సిన అంశాలు. అభ్యాసాల స్వభావాలను, వాటి

నిర్వహణను గురించి అవగాహన పొంది ఉండాలి. అప్పుడే విద్యార్థులచే అభ్యాసాలను సమర్థంగా చేయించగలడు. అందువల్ల వాటి గురించి చర్చించుకుందాం!

8, 9 వ తరగతుల పాఠ్యపుస్తకాలను కింది సామర్థ్యాల సాధనకు రూపొందించారు.

| 8వ తరగతి | | 9వ తరగతి | |
|---|---|---|---|
| I | వినడం – మాట్లాడడం | I | అవగాహన – చింతన (Comprehension - Reflection) |
| II | చదవడం – రాయడం | | (i) వినడం – ప్రతిస్పందించడం |
| III | స్వీయరచన | | (ii) చదవడం – అవగాహనచేసుకోవడం, ప్రతిస్పందన |
| IV | పదజాలం | II | వ్యక్తీకరణ – సృజనాత్మకత (ExpressHûn - Creativity)) |
| V | సృజనాత్మకత | | (i) స్వీయరచన |
| VI | ప్రశంస | | (ii) సృజనాత్మకత |
| VII | భాషాంశాలు | | (iii) ప్రశంస |
| | | III | భాషాంశాలు (Language Items) |
| | | | (i) పదజాలం |
| | | | (ii) వ్యాకరణం |

పైన తెలిపిన సామర్థ్యాలను సాధించటానికే పాఠ్యపుస్తకంలోని అభ్యాసాలు ఉన్నాయి. ఆయా అభ్యాసాల స్వభావాలు ఎలా ఉన్నాయో తెలుసుకోవలసిన అవసరం ఉంది. అందుకొరకు పాఠ్యపుస్తకంలోని అభ్యాసాలను పరిశీలించాలి.

**కింది ప్రశ్నలను పరిశీలించండి. వాటి స్వభావాలను తెలపండి.**

- దుందుభీనది ప్రవహించే తీరంలోని ప్రకృతి దృశ్యాలను గురించి సొంతమాటల్లో చెప్పండి. (దుందుభి)
- పాఠం ఆధారంగా పట్టికను పూరించండి. (మన సంస్కృతి)
- పద్యపాదాలకు సమానార్థకవాక్యాలు గుర్తించండి. (అమ్మకోసం)
- ప్రశ్నలకు పాఠం చదివి జవాబులు రాయండి. (ఇల్లు – ఆనందాల హరివిల్లు)
- 'సమర్థులకు క్షమ అవసరం' వివరించండి. (నీతిపరిమళాలు)
- పాఠంలోని మొదటి పేరా ఆధారంగా చిత్రాన్ని గీయండి. దాన్ని గురించి వర్ణించండి. (చూడడమనే కళ)
- పాఠంలోని ఏదైనా పేరాను వ్యవహార భాషలోకి మార్చి రాయండి. (సీతక్కపెండ్లి)
- కింది వాక్యాలను అవగాహన చేసుకొని గీతగీసిన పదాలకు నానార్థాలు రాయండి. (భూమి పుత్రుడు)
- పాఠంలోని పది సమాసపదాలు రాయండి. వాటికి విగ్రహవాక్యాలు రాయండి. ఏ సమాసమో తెలపండి. (ధర్మదీక్ష)
- పుట్టపర్తి నాయారాణాచార్యులుగారు అంత్యప్రాసలతో శివతాండవాన్ని, దాన్ని సౌందర్యాన్ని వర్ణిస్తూ రాసిన విధానాన్ని చూశారుకదా! దీనివల్ల మీరు పొందిన అనుభూతిని మీ 'డైరీ'లో రాయండి. ఉపాధ్యాయులకు చూపండి. (శివతాండవం)
- మేజర్ గిల్ వేటకు వెళ్ళి తొలిసారిగా అజంతా గుహలను దర్శించినట్లు చదివారుకదా! దీనివల్ల మన దేశానికి జరిగిన మేలు ఏమని భావిస్తున్నారో రాయండి. (అజంతా చిత్రాలు)
- హనుమంతుడు సముద్రలంఘనానికి ముందు కొన్ని చేష్టలు చేశాడు కదా! వాటి ఆంతర్యం ఏమైఉంటుంది? (సముద్ర లంఘనం)
- పరిశోధనలు ఎందుకు చేస్తారు? దీనివల్ల ఎవరికి మేలు జరగాలి? ఏ ఏ పరిశోధనలు సమాజానికి మేలు చేస్తాయి? (బతుకు పుస్తకం)
- శాస్త్రవేత్తల గురించి పత్రికల్లో వచ్చిన అంశాలను సేకరించండి. (ప్రేరణ)

© SCERT not to be republished

పై ప్రశ్నలను పరిశీలిస్తే అభ్యాసాల స్వభావం ఏ రకంగా ఉంటుందనే విషయం లేదా తత్త్వం మనకు బోధపడుతుంది. ఆయా స్వభావాలు కింది విధంగా ఉంటాయి.

**అభ్యాసాల స్వభావం:**

- విద్యార్థుల ఆలోచనలకు, అభివ్యక్తీకరణకు ప్రాధాన్యం ఇస్తాయి.
- విద్యార్థులలో ఉండే సామర్థ్యాలను వెలికితీస్తాయి.
- ఎదురైన సవాళ్ళను ఆసక్తితో ఎదుర్కొనే తత్త్వాన్ని అలవరుస్తాయి.
- ఒక విషయానికి సంబంధించి బహుకోణాల్లో ఆలోచించి సమాధానాలు రాసేటట్లు వేసే ప్రక్రియ.
- ఒక ప్రశ్న నుండి విద్యార్థుల ద్వారా విభిన్న జవాబులను / పరిష్కారాలను, అంటే బహుళ సమాధానాలను రాబడతాయి.
- విశ్లేషణశక్తిని, విమర్శనశక్తిని పెంపొదిస్తాయి.
- ప్రశ్నించే తత్త్వాన్ని రేకెత్తిస్తాయి.
- పిల్లలందరూ పాల్గొనే అవకాశం కలిగిస్తాయి.
- సృజనాత్మకంగా ఆలోచించి రాయడం అలవడేలా రాస్తాయి.
- కల్పనాశక్తితో స్వీయరచన చేయడం నేర్పుతాయి.
- పాఠ్యపుస్తకాన్నేకాక అదనపు పఠనాన్ని ప్రోత్సహిస్తాయి.
- తరగతి గదిలో పిల్లలు విభిన్న మానసిక స్థాయిలో ఉంటారు. ఇలా ఉన్న బహుళస్థాయి పిల్లలందర్నీ భాగస్వాముల్ని చేస్తాయి.
- భాషను నేర్చుకోవడంతోపాటు భాషావినియోగాన్ని పెంచుకొనేందుకు, పదజాలాభివృద్ధికి అధిక ప్రాధాన్యాన్ని ఇస్తాయి.

ఇలా విభిన్న స్వభావాలుగల ప్రశ్నలు మనకు ఈ పాఠ్యపుస్తకాల్లో కన్పిస్తాయి. వీటిద్వారా పిల్లల భాషాస్థాయి, భావవ్యక్తీకరణస్థాయి, విషయనైపుణ్యస్థాయిలను పెంచడమే ఈ ప్రశ్నలన్నిటి లక్ష్యం.

**అభ్యాసాల స్వభావాల గురించి తెలుసుకున్నారు కదా! పైన చెప్పిన అంశాలకు ఒక్కోదానికి ఒక్కో ఉదాహరణను పాఠ్యపుస్తకంలో వెదకండి.**

ఇప్పుడు ఒక్కొక్క సామర్థ్యానికి చెందిన అభ్యాసాల గురించి దాని ప్రాధాన్యం, ఆవశ్యకత, వాటికున్న ప్రత్యేక స్వభావం వాటి నిర్వహణ గురించి చర్చిద్దాం!

## I. వినడం - మాట్లాడడం

### (అ) ఆవశ్యకత / ప్రాధాన్యత :

విద్యార్థి తన ఇంటి వాతావరణం నుండే వినడం - మాట్లాడడం అలవాటు చేసుకొంటాడు. అయితే క్రమక్రమంగా ఈ వినడం - మాట్లాడడంలోని విభిన్న కోణాలను అర్థంచేసుకోవాల్సి ఉంటుంది. వీటిని వినియోగించుకొనే సామర్థ్యాన్ని పొందాలి. పాఠ్యపుస్తకాలు ఇందుకు తోడ్పడాలి. బడికి రాకముందే మాట్లాడే పిల్లవాడు బడిలో చేరిన తర్వాత స్వేచ్ఛగా మాట్లాడడం, ఆత్మవిశ్వాసంతో మాట్లాడడం, సూటిగా మాట్లాడడం, సందర్భోచితంగా మాట్లాడడం, సరైన పదజాలంలో అర్థవంతంగా వినసొంపుగా మాట్లాడడం గురించి అభ్యసిస్తాడు. అట్లాగే విన్నదాన్ని గురించి అర్థం చేసుకోవడంతోపాటు విశ్లేషించడం, అంతరార్థం గ్రహించడం, సందేశాన్ని పట్టుకోవడం వంటివి చేయగలగాలి.

ప్రాథమిక స్థాయిలో విద్యార్థి విని అర్థం చేసుకొని మాట్లాడే స్థాయికి చేరుకుంటే, మాధ్యమిక స్థాయిలో, విని అర్థం చేసుకొని ఆలోచించి మాట్లాడడం నేర్చుకుంటాడు. ఇక సెకండరీస్థాయి చేరుకొనేటప్పటికి వినడంలో మార్పు వస్తుంది. అర్థం చేసుకోవడం, ఆలోచించడం, విశ్లేషించుకోవడం, తన వాదనకు సరైన కారణాలను సమర్థంగా నిర్మించుకోవడం, బహుకోణాల్లో స్పర్శించడం తద్వారా మాట్లాడడం చేస్తాడు. అందుకే ప్రాథమిక స్థాయినుండి సెకండరీ స్థాయి వరకు గల పాఠ్యపుస్తకాల్లో 'వినడం - మాట్లాడడం' అనే సామర్థ్యాన్ని అభ్యాసాల్లో చేర్చడం జరిగింది. కింది ప్రశ్నల గురించి ఆలోచించండి.

**మరి, ఎనిమిది, తొమ్మిది తరగతుల పిల్లలు వినడం - మాట్లాడడం అనే సామర్థ్యం ద్వారా ఏం సాధించాలి? వీటికోసం పాఠ్యపుస్తకాలు ఎలాంటి అవకాశాలు కల్పించాయి? ఇందుకోసం ఉన్న అభ్యాసాలేవి? వీటి స్వభావం ఎలా ఉంది?**

**(అ) ఏం చేయగలగాలి?**

- విద్యార్థి తన ప్రతిస్పందనలను చెప్పగలగాలి.
- విమర్శనాత్మక ధోరణితో ప్రశ్నలకు జవాబులను చెప్పగలగాలి.
- అడిగిన ప్రశ్నలను విశ్లేషించి జవాబులు చెప్పాలి.
- వినడంద్వారా తన ఆలోచనలతో ఖచ్చితమైన సవ్యమైన అభిప్రాయాలను స్పష్టంగా వివరించగలగాలి.
- కుల, మత, లింగ, వర్ణ, వర్గవిచక్షణ లేకుండా ప్రతివారినీ అభినందించే తత్త్వంతో మాట్లాడగలగాలి.
- పాఠ్యాంశంలో ఉన్న విషయం ఆధారంగా, వర్ణన ఆధారంగా, విజ్ఞానం ఆధారంగా, అనుభూతి ఆధారంగా కవి హృదయాన్ని తన సొంతమాటల్లో ఆవిష్కరించగలగాలి.
- తన అభిప్రాయాన్ని స్పష్టంగా వ్యక్తం చేయగలగాలి.
- విషయాన్ని అన్వయించుకొని చెప్పగలగాలి.
- ఏదైనా విషయాన్ని విశ్లేషిస్తూ వ్యాఖ్యానించగలగాలి.
- ప్రతి అంశాన్నీ బహుకోణాల్లో ఆలోచించి వ్యక్తంచేయగలగాలి.
- చర్చల్లో పాల్గొనడం, ఉపన్యసించడం, వాదనలు వినిపించడం, ప్రశ్నించడం వంటివి చేయగలగాలి.

ఇలా వేరువేరు తీరులలో స్పష్టంగా మాట్లాడగలిగితే ఈ సామర్థ్యాన్ని సాధించినట్లుగా భావించాలి.

**(ఇ) స్వభావం :**

**8వ, 9వ తరగతుల్లోని "వినడం - మాట్లాడడం" శీర్షిక కింద ఇచ్చిన ఈ కింది ప్రశ్నలకు, ఏ స్వభావం ఉన్నదో ఆలోచించండి.**

- 'నదులు జీవనాధారాలు' - దీన్ని సమర్థిస్తూ మీ అభిప్రాయం చెప్పండి. **(దుందుభి)**
- నాటినుండి నేటివరకు ఇండ్ల నిర్మాణంలో వచ్చిన మార్పులు ఏమిటో చెప్పండి. **(మన సంస్కృతి)**
- కుటుంబంలో 'మన' అనే భావన లేకపోతే ఎలా ఉంటుంది? **(ఇల్లు - ఆనందాల హరివిల్లు)**
- స్వాతంత్ర్యం రావడానికి ముందు గ్రామాల్లో పరిస్థితి ఎలా ఉండేదని మీ కనిపించింది? **(చిన్నప్పుడే)**
- వరకట్న నిర్మూలనకు రావలసిన మార్పులను "వరునివైపు - వధువువైపు" జట్లుగా విడిపోయి చర్చించండి. **(సంస్కరణ)**
- "స్వశక్తిచేత" ఏ పనులనైనా సాధించవచ్చు. నిజమా? కాదా? వివరించండి. **(ప్రబోధం)**
- కింది అంశం గురించి విభేదిస్తూ లేదా సమర్థిస్తూ మాట్లాడండి. 'మాతృభాషలో విద్య' **(స్వభాష)**
- "మనిషి నెప్పుడు నమ్మగూడదు" అనే పులి మాటలు నిజమా! కాదా! ఎందుకు? వ్యాఖ్యానించండి. **(స.సే.మి.రా.)**

© SCERT not to be republished

పై ప్రశ్నలను లోతుగా చూసినప్పుడు వివిధ రీతుల్లో ఉంటాయి. వాటికి –

- స్వీయ ప్రతిస్పందన
- విమర్శనాత్మక ధోరణి
- విశ్లేషణ
- అభిప్రాయం తెలపడం
- అన్వయించుకోవడం
- కవిహృదయాన్ని ఆవిష్కరించడం
- వ్యాఖ్యానించడం
- అభినందించడం
- బహుకోణాల్లో ఆలోచించడం

మొదలయిన అంశాల్లో ఏదో ఒక స్వభావం ఉంటుంది. ఆయా స్వభావాలను ఉపాధ్యాయులు గుర్తించి సంబంధిత సామర్థ్యాలను సాధించాల్సి ఉంటుంది.

**(ఈ) నిర్వహణ :**

'వినడం – మాట్లాడడం' అనే ఈ సామర్థ్యాన్ని పూర్తి తరగతి కృత్యంగా అంటే ప్రతి ప్రశ్నను తరగతిలోని పిల్లలందరినీ అడగాలి. ఒక్కొక్కరిచేత మాట్లాడించాలి.

అవసరమైన చోట్ల అనుబంధ ప్రశ్నలను అడగాలి. **విద్యార్థులు చెప్పే సమాధానాలను ఖండించే ప్రయత్నం చేయగూడదు.** ఎందుకంటే విద్యార్థి తన వాతావరణంనుంచో, తన వ్యావహారికభాషాస్థితులనుంచో తన అనుభవాలనుంచో సమాధానాలు చెప్పే ప్రయత్నం చేస్తాడు. అందువల్ల వాటిని ఖండించగూడదు. అలా ఖండించడంవల్ల తాను మాట్లాడే స్థితిని కోల్పోయి భయంతో మౌనంగా ఉండే ప్రమాదం ఉంటుంది.

విద్యార్థులు చెప్పే సమాధానాలలో దొర్లే దోషాలను ఆప్యాయతతో సవరించాలి.

విద్యార్థుల సహజమైన మాటలను ప్రోత్సహించాలి. వాళ్ళను అభినందించాలి.

## II. చదవడం, అవగాహన చేసుకోవడం

ప్రాథమిక స్థాయిలో ధారాళంగా చదవడం చేయగలిగిన పిల్లలు ప్రాథమికోన్నత స్థాయిలో చదివిన అంశాన్ని అవగాహన చేసుకోవడం, దాన్ని వివరించగలగడం, ప్రతిస్పందించగలగడంలో శిక్షణ పొందుతారు. సెకండరీ స్థాయిలో పిల్లలు చదివిన అంశం గురించి విమర్శనాత్మక దృష్టితో ఆలోచించగలగాలి. రచయిత / కవి అంతరాత్మను, ఉద్దేశాన్ని పట్టుకోగలగాలి. 'చదవడం' అనే సామర్థ్యంద్వారా పిల్లల్లో పఠనాభిలాష పెరగడం, అర్థంచేసుకొని వ్యక్తీకరించగలగడం, తన జ్ఞానపరిధిని విస్తృతపరుచుకోవడం జరగాలి. ఇందుకోసం 8, 9 తరగతులలోని పాఠ్యపుస్తకాలలోని అభ్యాసాలను పరిశీలించండి.

- *చదవడం, అగాహన చేసుకోవడంకోసం ఎన్ని రకాల అభ్యాసాలు ఉన్నాయి?*
- *వీటిద్వారా పిల్లల్లో ఏ విధమైన పఠనసామర్థ్యం వృద్ధి చెందుతుంది? లేదా ఏం చేయగలుగుతారు?*
- *తరగతి గదిలో వీటిని ఎలా నిర్వహించాలి?*

**(అ) ఏం చేయగలగాలి?**

- ఇచ్చిన పరిచిత / అపరిచిత గద్య, పద్యాలను అవగాహనతో చదివి సంబంధిత జవాబులను రాయగలగాలి.
- ఇచ్చిన పద్య / గద్యాలను చదివి ప్రశ్నలను అనుసంధించగలగాలి.

© SCERT not to be republished

- అంశాన్ని చదివి సమాచారం ఆధారంగా పట్టికలను తయారుచేయగలగాలి.
- ఇచ్చిన అంశం ఆధారంగా సత్యాసత్యాలను గుర్తించగలగాలి, జతపరచగలగాలి.
- అంశం చదివి సరైన అర్థం వచ్చేలా ఖాళీలను పూరించగలగాలి.
- ఇచ్చిన పేరా ఆధారంగా విభిన్నమైన వాక్యాలను గుర్తించగలగాలి.
- సందర్భాలను గుర్తించి రాయగలగాలి.
- ఇచ్చిన పేరా ఆధారంగా లక్ష్యాత్మక ప్రశ్నలకు సమాధానాలను గుర్తించగలగాలి.
- ఇచ్చిన పద్యాన్ని చదివి ప్రతిపదార్థాన్ని రాయగలగాలి.
- ఇచ్చిన విషయంలో తప్పొప్పులను గుర్తించగలగాలి.
- ఇచ్చిన అంశంలోని పాత్రలను విషయాలు, వస్తువులు మొదలయినవాటి పోలికలను అవగాహనతో గుర్తించి రాయగలగాలి.
- ఇచ్చిన పేరాను లేదా అంశాన్ని చదివి "శీర్షిక"ను నిర్ణయించగలగాలి.
- అర్థానికి అనుగుణంగా పద్యపాదాలను, పేరాలను, లేదా భావస్ఫోరక వాక్యాలను గుర్తించి రాయగలగాలి.
- క్రమపద్ధతిలో లేదా పాదపద్ధతిలో వాక్యాలను, పద్యాలను అమర్చగలగాలి.
- పాఠ్యాంశాన్ని చదివి ఇచ్చిన ప్రశ్నలకు సొంతంగా జవాబులు రాయగలగాలి.
- ఇచ్చిన పద్యాన్ని చదివి భావాన్ని రాయగలగాలి.

ఈ రకంగా చదవడం – రాయడం అనే ప్రక్రియలో ఇచ్చిన అంశాన్ని అవగాహనతో చదవడం దానికి సంబంధించిన విషయాన్ని గూర్చి రాయడం అనేదే ప్రధానమైంది. ఇలా చేయగల్గినప్పుడే విద్యార్థి ఈ సామర్థ్యాన్ని సాధించినట్లుగా భావించాలి.

**(ఆ) చదవడం, అవగాహనచేసుకోవడం అభ్యాసాల స్వభావం :**

ఎనిమిది, తొమ్మిది తరగతుల్లోని చదవడం అవగాహనచేసుకోవడానికి సంబంధించిన కొన్ని ప్రశ్నలున్నాయి. వీటిని పరిశీలించండి.

- కింద ఇచ్చిన వాక్య భావాలకు సరిపోయే గేయ పాదాలను గుర్తించి రాయండి. **(దుందుభి)**

  అ) చెట్లను తాకి, జాజిపూల రంగులద్దుకొని ప్రవహిస్తావా?

  ఆ) పుట్ట రంధ్రాలను ముంచుతూ ప్రవహిస్తావా?

- కింది మాటలు ఎవరు ఎవరితో అన్నారో, ఏ సందర్భంలో అన్నారో రాయండి **(అమ్మకోసం)**

  అ) మాయీ దాస్యము వాయు నుపాయము సేయుండు.

- కింది పదాలను పాఠంలో గుర్తించండి. ఆ వాక్యాలను చదవండి. వాటి గురించి రాయండి. **(ఇల్లు – ఆనందాల హరివిల్లు)**

  ఆశ్రమ ధర్మాలు, జీవితపథం, విశ్వసనీయత, సమష్టివ్యవస్థ.

- పాఠంలోని పద్యాల ఆధారంగా కింద తెలిపిన వాటిని వేటితో పోల్చారో రాయండి. **(నీతి పరిమళాలు)**

  అ) రసజ్ఞత ఆ) అవివేకం ఇ) వాక్కు

- పాఠం చదవండి. కింది పట్టికను పూరించండి. (ప్రతిజ్ఞ)

| వృత్తులు | వాడే పనిముట్లు |
|---|---|
| ఉదా॥ జాలరి | పగ్గం |
| 1 ______ | __________ |
| 2 ______ | __________ |

- కింది కవిత చదివి నాలుగు ప్రశ్నలు తయారుచేయండి. **(ప్రతిజ్ఞ)**
- పాఠం చదివి కింది ప్రశ్నలకు జవాబులు రాయండి. **(శాంతికాంక్ష)**
  1. ధర్మరాజు రాజ్యసంపద దేనికోసం కోరాడు?
  2. శత్రుస్వభావాన్ని కవి దేనితో పోల్చాడు?
- 9వ, 10వ పద్యాలకు ప్రతి పదార్థం రాయండి **(పద్యరత్నాలు)**
- పాఠం ఆధారంగా కింద పేర్కొన్న వ్యక్తులను పరిచయం చేయండి. **(సీతక్కపెండ్లి)**

  1) రఘురాం 2) మాలక్ష్మి 3) సీతక్క 4) నాగయ్య 5) కోటయ్య
- కింది పేరాను చదవండి. కారణాలను రాయండి. **(భూమి పుత్రుడు)**

పై ప్రశ్నలను లోతుగా చూసినప్పుడు వాటి స్వభావాలు వివిధ రకాలుగా కనబడతాయి.

- భావాలకు తగిన పద్యపాదాలను గుర్తించడం.
- సందర్భాన్ని గుర్తించి ఎవరు ఎవరితో అన్నారో రాయడం.
- పాఠంలో ఉన్న విశేషపదాల అర్థాల వివరణ నివ్వడం.
- పాఠం ఆధారంగా పోలికలను గుర్తించి రాయడం.
- ఇచ్చిన అంశం ఆధారంగా పట్టికను తయారుచేయడం.
- పాఠాన్ని చదివి ప్రశ్నలకు జవాబులు రాయడం.
- ప్రశ్నలను తయారుచేయడం.
- పద్యాలకు ప్రతిపదార్థం రాయడం.
- పాఠం ఆధారంగా వ్యక్తులను పరిచయం చేయడం.
- పేరాను చదివి కారణాలను రాయడం.

మొదలయిన స్వభావాలు వాటికి ఉన్నాయి. ఈ ప్రశ్నల విధానాన్ని ప్రధానంగా మూడు రకాలుగా విభజించవచ్చు. అవి:

(i) పాఠ్యాంశాన్ని చదివి గుర్తించడం - రాయడం.

(ii) పరిచిత / అపరిచిత అంశాలను చదివి అవగాహన చేసుకొని గుర్తించి రాయడం.

(iii) పాఠ్యాంశానికి సంబంధించిన ప్రశ్నలకు జవాబులను రాయడం.

ఇలా ప్రశ్నల్లో ఉన్న వివిధ రకాల స్వభావాలను ఉపాధ్యాయులు గుర్తించాలి. విద్యార్థులు ఆయా సామర్థ్యాలను సాధించేటట్లు చూడాలి. అయితే ఇందుకు ఈ అభ్యాసాలను ఎలా నిర్వహించాలో తెలుసుకుందాం!

**(ఇ) నిర్వహణ :**

చదవడం, అవగాహనచేసుకోవడం సామర్థ్యానికి సంబంధించిన అభ్యాసాలను వ్యక్తిగత కృత్యంగానే నిర్వహించాలి. విద్యార్థులందరిచేత సాధన చేయించాలి. వారు చేసే దోషాలను వెనువెంటనే సవరించాలి. వారు చేసే ప్రయత్నాలను ప్రోత్సహించాలి. విద్యార్థి ఉచ్చారణకు అనుకూలమైన పదాలను రాయడం తప్పు గాదని గుర్తించాలి. ఉచ్చారణ సరిచేసి సరైన పదాలను రాసేలా ముందుకు నడిపించాలి. అభినందించాలి. పాఠం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయడాన్ని ఇంటిపనిగా ఇవ్వవచ్చు. మిగతావాటిని తరగతి గదిలోనే వ్యక్తిగత కృత్యంగా నిర్వహించాలి. విద్యార్థుల సంఖ్యనుబట్టి సామర్థ్యసాధనకు అనుకూలమైన విధానాన్ని ఉపాధ్యాయులు ఎన్నుకోవాలి.

© SCERT not to be republished

## III. స్వీయరచన

స్వీయరచన అంటే విద్యార్థి తన సొంత ఆలోచనలతో తనదైన విధానంలో ప్రశ్నలకు జవాబులు రాసే విధానం లేదా తెలిసిన అంశాల గురించి రాయడం. ప్రాథమిక, మాధ్యమిక స్థాయినుండి పిల్లలు సెకండరీ స్థాయికి చేరుకొనే క్రమంలో ఆలోచనాశక్తి కూడా పెరుగుతుంది. APSCF-2011 నిర్దేశించిన ప్రకారం అవగాహన చేసుకొని తన సొంతమాటల్లో రాయడం అనేది రావాలి. ఇప్పటి వరకు పాఠ్యపుస్తకంలోని పాఠాల్లో ఉన్న ప్రశ్నలను బట్టీ ద్వారా సమాధానాలు రాయడంవల్ల విద్యార్థుల సామర్థ్యాలు అంటే విశ్లేషణ, విమర్శనాత్మక, బహుకోణీయాలోచన, సమస్యా పరిష్కారసాధన మొదలగు అనేక విషయాల్లో తాను స్వయంగా రాయాల్సిఉంది. అభిప్రాయాలను లిఖిత రూపంలో వ్యక్తీకరించాల్సి ఉంటుంది. అభిప్రాయాలను లిఖిత రూపంలో చెప్పాల్సిఉంది. అందుకే సెకండరీ స్థాయిలో ఈ స్వీయరచనలో ఉన్న ప్రశ్నల స్థాయి పెరుగుతుంది. జవాబురాసే విధానంలో కూడా మార్పులుంటాయి. భాషా వినియోగంలో కూడా మార్పులుంటాయి.

**ఆలోచించండి.**

- *8, 9 తరగతుల పిల్లలు వేటిని ఎలా రాయగలగాలి?*
- *పాఠ్యపుస్తకాలలో ఇందుకోసం ఎలాంటి ప్రశ్నలు ఉన్నాయి?*
- *వీటిని తరగతి గదిలో ఎలా నిర్వహించాలి?*

© SCERT not to be republished

**(అ) ఏం చేయగలగాలి?**

- విషయాన్ని విశ్లేషిస్తూ రాయగలగాలి.
- అంశాన్ని విమర్శిస్తూ రాయగలగాలి.
- మరో అంశంతో పోలుస్తూ రాయగలగాలి.
- సాధికారంగా అభిప్రాయాన్ని తెలపగలగాలి.
- బహుకోణాల్లో జవాబులు రాయగలగాలి.
- బహుళ సమాధానాలు చెప్పగలగాలి.
- విషయవివరణ ఇవ్వగలగాలి.
- సమర్థిస్తూ లేదా వ్యతిరేకిస్తూ అందుకు కారణాలను వివరించగలగాలి.
- పరిష్కార దృష్టితో వివరించగలగాలి.
- ఊహా ప్రతిస్పందనలను తెలియపరచగలగాలి.
- వివిధ సందర్భాలను అన్వయించుకొని వివరించగలగాలి.
- అంశంపై వ్యాఖ్యానించగలగాలి.
- వ్యాసం రాయగలగాలి.

**(ఆ) స్వభావం :**

స్వీయరచనలోని ప్రశ్నల స్వభావం క్షుణ్ణంగా అవగతమవాలంటే పాఠ్యపుస్తకంలోని కొన్ని ప్రశ్నలను పరిశీలించాల్సిందే.

మచ్చుకు కొన్ని ప్రశ్నలను కింద ఇస్తున్నాం. పరిశీలించండి.

- యోగ్యులైన పిల్లలవల్ల తల్లిదండ్రులకు కలిగే ప్రయోజనాలేమిటి? **(అమ్మకోసం)**
- మన సంస్కృతి గొప్పతనాన్ని చెప్పే అంశాల్ని విశ్లేషిస్తూ అభిప్రాయం రాయండి. **(మన సంస్కృతి)**

- కుటుంబ వ్యవస్థ బాగా కొనసాగాలంటే మనమేంచేయాలి? **(ఇల్లు – ఆనందాల హరివిల్లు)**
- ఈ కవిత మీకు ఎందుకు నచ్చిందో సొంత మాటల్లో రాయండి. **(ప్రతిజ్ఞ)**
- "మనుషులు పదుగురు కూడితే ఒక ఊరవుతుంది" అని సి.నా.రె. ఎందుకు అని ఉంటారు? **(జీవన భాష్యం)**
- "స్త్రీ శక్తిస్వరూపం" ఈ మాటలను సమర్థిస్తూ రాయండి. **(ప్రబోధం)**
- గౌతమబుద్ధుడు నందగోపాలుడిపై వాత్సల్యాన్ని ఎలా చూపించాడు? దానికి కారణాలు ఏమిటి? **(ధర్మదీక్ష)**
- 'సందర్భాన్ని బట్టి స్పందించాలి' దీన్ని ఉదాహరణలతో వివరించండి. **(రుబాయీలు)**
- కార్యసాధన అంటే అనుకొన్నది సాధించడం. ధర్మరాజు మాటలనుబట్టి ఈ కార్యసాధనను మనం ఎలా సాధించాలి? (శాంతికాంక్ష)

పై ప్రశ్నలను లోతుగా చూసినప్పుడు విభిన్న స్వభావాలున్న ప్రశ్నలుగా మనకు కనబడతాయి. ఎలా అంటే...

- విశ్లేషణాత్మకంగా
- వివరణాత్మకంగా
- సమస్యాపరిష్కారాత్మకంగా
- నచ్చిన అంశాన్ని కారణాలతో వివరించగలిగేవిగా
- ఇచ్చిన అంశాన్ని సమర్థిస్తూ రాసే విధంగా
- ఊహాత్మకంగా జవాబులు రాయడానికి వీలున్నవిగా
- సందర్భోచిత ప్రతిస్పందనలు తెలియజేసే విధంగా
- అన్వయపరంగా జవాబును రాయగలిగే విధంగా
- అభిప్రాయం సాధికారంగా చెప్పేరకంగా
- సమర్థిస్తూ జవాబురాసేరకంగా ఉన్నాయి.

**పాఠ్యపుస్తకంలో పై స్వభావాలున్న మరికొన్ని ప్రశ్నలను గుర్తించండి.**

**(ఇ) నిర్వహణ :**

ఈ "స్వీయరచన" అభ్యాసాన్ని వ్యక్తిగత కృత్యంగా నిర్వహించాలి. అవసరమైన సందర్భంలో పూర్తి తరగతికృత్యంగా నిర్వహించాలి. ఆయా ప్రశ్నలను పిల్లలు పూర్తిగా అవగాహన చేసుకొనేలా ఉపాధ్యాయుడు చర్చ నిర్వహించాలి. కొన్ని సందర్భాలలో సూచనలు సలహాలు కూడా ఇవ్వాల్సివస్తే అందించాలి. వాళ్ళడిగే సందేహాలను నివృత్తి చేయాలి.

ఇందులోని కొన్ని ప్రశ్నలను ఇంటిపనిగా ఇచ్చే అవకాశం ఉన్నట్లైతే అది ఉపాధ్యాయుడు వినియోగించుకొనవచ్చు.

దోషసవరణ తరగతి గదిలో చేపట్టాలి. ఇది పూర్తి తరగతిలో చర్చ ద్వారా జరగాలి. విద్యార్థుల అభిప్రాయాలకు విలువనివ్వాలి. అభిప్రాయాల్లో ఉన్న తార్కికతను పిల్లలకు వివరించే ప్రయత్నం చేయాలి.

అభ్యాసాల్లోని ప్రశ్నలకు జవాబులు ప్రతి విద్యార్థినుండి భిన్నంగానే వస్తాయి. ఒకవేళ అలా కానట్లైతే సామర్థ్యసాధన జరగనట్లే భావించాల్సి ఉంటుంది. ప్రతి విద్యార్థి స్వీయరచన చేసేట్లు ప్రోత్సహించాలి. సామర్థ్యాన్ని సాధించేట్లు చూడాలి.

## పిల్లలు రాసిన అంశాలను సవరించే విధానం

- పిల్లలు జట్లలో చర్చించి రాసిన / వ్యక్తిగతంగా రాసిన సమాధానాలను చార్టుపై రాయించాలి లేదా నల్లబల్లపై రాయించాలి.
- ఒక్కో జట్టువారిచే వ్యక్తిగతంగా ప్రదర్శింపజేయాలి.

© SCERT not to be republished

✦ పిల్లలు రాసిన అంశాన్ని తరగతిలో చర్చిస్తూ కింది విధంగా సరిచేయాలి.

- *భావం సరిగా ఉందా? వరసక్రమంలో విషయాన్ని రాశారా?*
- *వాక్యనిర్మాణం సరిగా ఉందా?*
- *వాక్యాలు సంపూర్ణవాక్యాలుగా దోషరహితంగా ఉన్నాయా?*
- *వాక్యాలలో ఉపయోగించిన పదాలు సరిగా ఉన్నాయా? ఇంకే పదాలు ఉపయోగించవచ్చు?*
- *అక్షరదోషాలు ఏవైనా ఉన్నాయా?*

ఇలా ఒక్కో ప్రశ్న పిల్లలను అడుగుతూ పిల్లలు రాసిన దాన్ని పిల్లలతో చర్చిస్తూ సరిచేయించాలి. కొంత అభ్యాసం జరిగిన తర్వాత ఒక జట్టువారు రాసిన అంశాలను ఇంకొక జట్టువారికిచ్చి కూడా సరిచేయించవచ్చు.

- ఇలా సరిదిద్దిన తర్వాత పిల్లలను వ్యక్తిగతంగా రాయమనాలి.

## IV. పదజాలం

ఒకరి అభిప్రాయాలను ఒకరికి తెలుపుకోడానికి వాడే మాటల అర్థవంతమయిన కూర్పు ఉన్నది భాష. దీనిలో అత్యధిక భాగం పదజాలం. విద్యార్థులు పదజాలాన్ని ఎంత ఎక్కువగా సంపాదిస్తే భాషమీద అంత పట్టుపెరుగుతుంది. సందర్భాన్నిబట్టి, సమయోచితంగా మాట్లాడాలంటే, రాయాలంటే పదజాల వినియోగాన్ని గురించి సరయిన అవగాహన ఉండాలి.

ఉన్నత స్థాయిలోని విద్యార్థులు జాతీయాలు, సామెతలు, నానార్థాలు, పర్యాయపదాలు, ప్రకృతివికృతులు లాంటివాటిని గురించి వివరంగా తెలుసుకొనే అవకాశం ఉంది. ప్రాచీన, ఆధునిక భాషా పాఠ్యాంశాల్లోని పద ప్రయోగాలను తెలుసుకోగలగాలి. ఆయా పదాల ప్రయోగాలను అవగాహన చేసుకొని తాను వినియోగించాలంటే “పదజాలం” సామర్థ్యాన్ని సాధించాలి.

**ఆలోచించండి.**

- *8, 9 తరగతుల్లో ఏ పదజాలం గురించి అభ్యాసాలు ఉన్నాయి?*
- *ఇందుకోసం ఏ ఏ రకాలైన అభ్యాసాలు ఉన్నాయి? ఇవి ఎలా ఉన్నాయి?*
- *పిల్లలు ఏమేమి చేయగలగాలి?*
- *వీటిని తరగతి గదుల్లో ఎలా నిర్వహించాలి?*

**(అ) ఏం చేయగలగాలి?**

ఈ సామర్థ్యానికి సంబంధించిన అభ్యాసాల ద్వారా

- జాతీయాల అర్థాలను గ్రహించగలగాలి.
- వివిధ పదాల నానార్థాలు, పర్యాయపదాలు సొంతవాక్యాలలో వినియోగించగలగాలి.
- ప్రకృతివికృతులను గుర్తించగలగాలి – ఉపయోగించగలగాలి.
- ప్రాచీన భాష, ఆధునిక భాషల్లో పదాల ప్రయోగాన్ని గుర్తించి ఆయా సందర్భాల్లో వాడగలగాలి.
- వ్యతిరేకార్థక పదాలను వాక్యాల్లో వినియోగించగలగాలి.
- సందర్భోచితంగా, సమయోచితంగా వాడే పదాలను గుర్తించి తాను ప్రయోగించగలగాలి.

**(ఆ) స్వభావం :**

ఈ ప్రశ్నల స్వభావం తెలియాలంటే పాఠ్యపుస్తకంలోని కొన్ని ప్రశ్నలను పరిశీలించండి.

- కింది వాక్యాలలో గీతగీసి పదాన్ని మరో సందర్భానికి అన్వయించి వాక్యాలు తిరిగిరాయండి.

  ఇ) <u>కాలగతి</u>లో కొన్ని చిత్రాలు నశించాయి. **(అజంతా గుహలు)**

© SCERT not to be republished

- కింది వాక్యాల్లో గీతగీసిన పదాలకు అదే అర్థం వచ్చే మరి రెండు పదాలను ఎంపికచేసుకొని వాక్యాలు రాయండి. **(చిన్నప్పుడే)**

  (i) పెద్దవాళ్ళకు <u>నమస్కారం</u> చేయడం మన సంస్కృతి.

- కింది వాక్యాల్లో గీతగీసిన పదాల అర్థాలను పదవిజ్ఞానం ఆధారంగా రాయండి. **(ప్రాచీన సాహిత్యాధ్యయనం ఆవశ్యకత)**

  (ఆ) <u>వైజయంతిక</u> లీ మహాకావ్యాలు (                )

- కింది పదాలకు వ్యుత్పత్తి అర్థాలు రాయండి. (పద్యరత్నాలు)

  1) దాశరథి    2) ధూర్జటి

పై ప్రశ్నలను పరిశీలిస్తే...

- సందర్భోచిత పద ప్రయోగం.
- పర్యాయపద ప్రయోగం.
- నిఘంటువు వినియోగం ద్వారా పదాల అర్థాలు తెలుసుకోవడం.
- పదాల వ్యుత్పత్తి తెలుసుకోవడం.

లాంటివి స్వభావాలు కనబడుతున్నాయి. అట్లాగే వివిధ పదజాల స్వభావాలను తెలిపే ప్రశ్నలున్నాయి. గళ్ళు ఆధారంగా కూడా సమాధానాలు రాయాల్సిన ప్రశ్నలు ఇవ్వడం జరిగింది.

**పదజాల స్వభావ ప్రశ్నలెన్ని రకాలుగా పాఠ్యపుస్తకంలో ఉన్నాయో చూసి ఒక్కో రకానికి ఒక్కో ప్రశ్నను వెదకండి.**

**నిర్వహణ :**

"పదజాలం" అభ్యాసాలను వ్యక్తిగత కృత్యంగాను, పూర్తితరగతి కృత్యంగాను నిర్వహించవచ్చు. ఏ సందర్భానికి ఏది అవసరమో అది నిర్వహించాలి. విద్యార్థులను సమూహాలుగా చేసి. జట్టు కృత్యంగానూ నిర్వహించవచ్చు. ఈ పదజాల వినియోగానికి నిఘంటువును ఉపయోగించేలా చూడాలి. పర్యాయపదాలు, నానార్థాలను వాక్యాల్లో ప్రయోగించి అర్థం తెలుసుకునేలా చేయాలి. ప్రకృతివికృతులు, వ్యతిరేకార్థకాలు, జాతీయాలు మొదలయినవన్నింటిని ప్రయోగపద్ధతిలో చూపించి విద్యార్థుల వినియోగంలోకి తేవాలి. విద్యార్థి కల్పతరువులాంటి పుస్తకాలను ఉపయోగించేలా నిర్వహించాలి.

దోషసవరణ వెంట వెంటనే చేయాలి. విద్యార్థుల భాషలోని యాసను ఖండించగూడదు. ప్రాంతీయ / మాండలిక పదాల ఉపయోగాన్ని తప్పు అని అనగూడదు. వారి భాషను గౌరవించాలి. వారిస్థాయికి తగిన భాషారూపమేదో చెప్పాలి.

## V. సృజనాత్మకత

పిల్లలు పాఠంలోని ప్రశ్నలకు జవాబులను బట్టీపట్టి రాయడంవల్ల భాషలోని ఏ ప్రక్రియను తాము స్వయంగా సృజించలేకపోతున్నాడు. ఈ లోటును పూడ్చాలని APSCF 2011 భావించింది. అందుకే విద్యార్థిలోని సృజనాత్మకతను వెలికితీయగలిగేలా అభ్యాసాల నిర్వహణ ఉండాలని నిర్దేశించింది.

దానికనుగుణంగానే నూతన పాఠ్యపుస్తకాల్లో ఈ సామర్థ్యం పొందుపరచడమైంది. సృజనాత్మకత అనేది ఊహ తెలిసిన పిల్లల దగ్గరినుండి మొదలుకొని పెద్దవారి వరకు ప్రతి వారిలో ఉంటుంది. దాన్ని వెలికితీసే ప్రయత్నం చేయకుంటే అది స్తబ్ద&ధమౌతుంది. అలా కాకూడదనే, వివిధ స్థాయిల్లో వివిధ ప్రశ్నలను ఇవ్వడం జరిగింది. సెకండరీ స్థాయిలోని పిల్లలు ఓ వ్యాఖ్యానం రాయగలగాలి. ఒక కవిత, వ్యాసం, పీఠిక మొదలయిన అంశాలను రాయగలిగితేనే ఈ సామర్థ్యసాధన జరిగినట్లు భావించాలి.

**ఆలోచించండి.**

- *8, 9 తరగతుల్లో సృజనాత్మకతకోసం ఏ ఏ అభ్యాసాలు ఉన్నాయి?*
- *వీటి ద్వారా పిల్లలు ఏమేమి చేయగలుగుతారు?*
- *వీటిని తరగతి గదిలో ఎలా నిర్వహించాలి?*

**(అ) ఏం చేయగలగాలి?**

- కవుల భావాలను నీతివాక్యాల రూపంలో రాయగలగాలి.
- ఓ పద్యాన్ని ఒక గేయంగానో, వచనకవితగానో మార్చగలగాలి.
- కరపత్రం తయారుచేయగలగాలి.
- మహోన్నత వ్యక్తుల పాత్రలను అభినయించాలి.
- ఒక గేయాన్ని ఓ కవితగానో, ఓ కథగానో మలచగలగాలి.
- లేఖలు రాయగలగాలి.
- వర్ణనాత్మకంగా రాయగలగాలి.
- నచ్చిన వస్తువును ఎన్నుకొని చిత్రం గీయగలగాలి. దాన్ని వివరించగల్గాలి.
- ఆత్మకథను రాయగలగాలి.
- సంభాషణారూపంలోకి మార్చగలగాలి.
- ఓ గేయకథను రాయగలగాలి.

**(ఆ) స్వభావం :**

సృజనాత్మకత కింద ఇచ్చిన ప్రశ్నలను పరికిస్తే వాటి స్వభావాలు తొందరగా అవగతమౌతాయి. మచ్చుకు కొన్ని ప్రశ్నలు–

- పాఠం ఆధారంగా గరుడునికీ, కద్రువ కుమారులకూ మధ్య జరిగిన పరస్పరచర్యను సంభాషణ రూపంలో రాయండి. **(అమ్మకోసం)**
- ఈ పాఠాన్ని ఆధారంగా చేసుకొని మీ అనుభవాలతో, ఒక చిన్న కథ రాయండి. **(చిన్నప్పుడే)**
- పాఠంలో మనదేశం గొప్పతనాన్ని తెలుసుకున్నారుకదా! మనదేశం గొప్పతనాన్ని వర్ణిస్తూ, భారతీయ విలువలు కాపాడటానికి అందరూ బాధ్యత తీసుకోవాలని ఒక "కరపత్రం" తయారుచేసి ప్రదర్శించండి. **(ప్రాచీన సాహిత్యాధ్యయన ఆవశ్యకత)**
- ప్రతీకారం మంచిది కాదనీ, శాంతియుతజీవనం గొప్పదనీ మీ మిత్రునికి లేఖ రాయండి. **(శాంతికాంక్ష)**
- పాఠ్యాంశం ఆధారంగా కొన్ని సూక్తులు తయారుచేయండి. **(రుబాయీలు)**
- కాళోజి తన కవిత ఎలా ఉండాలని అనుకున్నాడో తెలిసిందికదా! అదే విధంగా కథ ఎలా ఉండాలని మీరు అనుకుంటున్నారో కవితారూపంలో రాయండి. **(ఈప్స)**

పై ప్రశ్నలను పరిశీలిస్తే –

- సంభాషణరూపం
- కథానికారూపం
- కరపత్రం

© SCERT not to be republished

- లేఖ
- సూక్తులు తయారుచేయడం
- కవితారూపానికి సంబంధించి

ప్రశ్నలు ఉన్నట్లు కనబడుతున్నాయి. ఇవేకాక ఇంకా వివిధ ప్రక్రియలకు అనుసృజనచేయగలప్రశ్నలున్నాయి.

**(ఇ) నిర్వహణ :**

ఈ సామర్థ్యాన్ని కూడా పూర్తి తరగతి కృత్యంగానే నిర్వహించాలి. ఉపాధ్యాయుడి ప్రోత్సాహం ఎక్కువగా ఉండాలి. ప్రశ్నల భావాలను విడబరచి చెప్పి సమాధానాన్ని అనుసృజింపచేయాలి. చర్చ ద్వారా అవగాహన కల్పించాలి.

విద్యార్థి తన భావాలను ప్రదర్శించడానికి అనుమతించాలి, అభినందించాలి. తోటి విద్యార్థినీవిద్యార్థులచే అభినందింపజేయాలి.

"స్వీయరచన" నిర్వహణలాగానే సృజనాత్మక కృత్యాలను కూడా నిర్వహించాలి అంటే పూర్తి తరగతిలో సూచనలు ఇవ్వడం, జట్లలో లేదా వ్యక్తిగతంగా చేయించడం / రాయించడం, వాటిని ప్రదర్శింపజేయడం, ఆ తర్వాత సరిదిద్దడం జరగాలి. తర్వాత పిల్లలచేత వ్యక్తిగతంగా రాయించాలి.

## VI. ప్రశంస

ఒక్క ప్రశంస చాలు, కోటి ఏనుగుల బలం లభించినట్లు చేయడానికి. అయితే ఈ ప్రశంస అనేది కుల, మత, వర్గ, లింగ, భాషా భేదాల చుట్టూ తిరగడంవల్ల దేశంలో నైతిక విలువలు తగ్గిపోయి ఈర్ష్య, అసూయాద్వేషాలు పెచ్చుమీరుతున్నాయి. సంకుచిత ధోరణులు ప్రబలుతున్నాయి. మేధ అడుగంటి దుర్బుద్ధి రాజ్యం చేస్తున్నది.

ఈ ప్రమాదాలనుండి మనల్ని మనం కాపాడుకోవాలంటే విద్యార్థి దశ నుండే సరైన మార్గదర్శనంచేయాల్సి ఉంటుంది. అందుకే దీన్నొక్క సామర్థ్యంగా విద్యాప్రమాణంగా APSCF 2011 నిర్దేశించింది. సరైన రీతిలో సరైన వ్యక్తులను ప్రశంసించడమనేది అత్యావశ్యకం. దీనివల్ల స్ఫూర్తి ఏర్పడుతుంది. ఈర్ష్య, అసూయాద్వేషాలు దరిచేరవు.

ప్రశంస అనేది ఒక వ్యక్తికి, ఒక వ్యవస్థకు, ఒక సంస్థకు, ఒక దేశానికి, ఒక గ్రామానికి, ఒక మేధకు లేదా మరోదానికి కావచ్చు. అది సార్వజనీనంగా, సార్వత్రికంగా ఉండాలి. పిల్లల్లో ఎదుటివారిలోని / వర్గంలోని గొప్పదనాన్ని గుర్తించి ప్రశంసించే వైఖరి పెంపొందాలి. ఇది ఉత్తమ వ్యక్తిత్వానికి ప్రతీక.

**(అ) ఏం చేయగలగాలి?**

ప్రశంస కింద ఇచ్చిన అభ్యాసాలేగాక, ఆటా సందర్భాన్ని బట్టి కూడా తగిన ప్రశ్నలను కూడా ఉపాధ్యాయుడు సంధించవచ్చు. వాటి ద్వారా విద్యార్థులు

- మతభేదం లేకుండా, కులభేదం లేకుండా మంచి పని చేసినవారిని ప్రశంసించగలగాలి.
- భాషాభేదంతో, లింగభేదంతో నిమిత్తం లేకుండా వ్యక్తులను ప్రశంసించగలగాలి.
- కవి / రచయిత భావాలను ప్రశంసించగలగాలి.
- తోటివారిలో ఉండే గొప్పతనాన్ని మెచ్చుకోగలగాలి.
- వికలాంగులను, అంటే ప్రత్యేక అవసరాలు కలిగిన వారిని, వృద్ధులను వారిమంచి పనులను ప్రశంసించగలగాలి.
- వివిధ భాషానిర్మాణాలను, పదాలను పోల్చుకొని ప్రశంసించగలగాలి.
- చర్చలో తాను ఓడినా ఎదుటివారిని అభినందించగలగాలి.
- ప్రతి మంచినుండి స్ఫూర్తి పొంది, ఆ మంచిని కీర్తించగలగాలి.

**(ఆ) స్వభావం :**

పాఠ్యాంశాల్లోని ప్రశ్నలను గమనిస్తే ఈ ప్రశ్నల స్వభావాలు ఎలా ఉంటాయో తెలుస్తాయి. ఉదా:

- రుబాయిీ ఛందస్సులో రాసిన కవితని, భావసౌందర్యాన్ని ప్రశంసిస్తూ ఆరు వాక్యాలను రాయండి. **(రుబాయీలు)**
- పాఠంలోని ఏదైనా పేరాను వ్యవహారభాషలోకి మార్చి రాయండి. **(సీతక్క పెండ్లి)**
- మీ తరగతిలో మీ మిత్రులు రాసిన పుస్తక పరిచయ నివేదికల్లో ఎవరి నివేదిక బాగుంది? అది ఎందుకు బాగుందో వివరిస్తూ వారిని ప్రశంసిస్తూ పది వాక్యాలు రాయండి. **(బతుకు పుస్తకం)**
- మీ పాఠంలో హనుమంతుని శక్తియుక్తులను వర్ణించిన కవిని ప్రశంసిస్తూ, అతని రచనలు చదవమని సలహా ఇస్తూ మిత్రునికి ఒక లేఖ రాయండి. **(సముద్ర లంఘనం)**
- శ్రీశ్రీ కవితాశైలి ఎలాంటిది? ఆయన చేసిన పదప్రయోగం గురించి ఒక వ్యాసం రాయండి. **(ప్రతిజ్ఞ)**
- దుందుభి గేయంలో కవి నదిని అద్భుతంగా వర్ణించాడు. ఇది ఆసక్తి కలిగించేలా ఉంది కదా! దీనివల్ల మీకు ఎలాంటి ఆసక్తి కలిగిందో వివరిస్తూ ఒక వ్యాసం రాసి గోడపత్రికలో ప్రదర్శించండి.

పై ప్రశ్నలను పరిశీలిస్తే –

- ఇతర భాషల్లోని భావసౌందర్యం.
- భాషలోని శైలీభేద ప్రశంస.
- తోటి మిత్రులను ప్రశంసించడం.
- లేఖద్వారా కవి వర్ణనాశక్తిని ప్రశంసించడం.
- కవుల కవిత్వ శైలిని వ్యాసం ద్వారా ప్రశంసించడం.
- గోడపత్రిక ద్వారా కవి చెప్పిన ఆసక్తికర, వర్ణనా వివరాలను ప్రశంసించడం లాంటి స్వభావాలు కనబడతాయి.

**ఒక్కోరకమైన ప్రశంసను గుర్తిస్తూ పాఠ్యాంశాల్లో ఇచ్చిన వివిధ రకాల ప్రశంసా సామర్థ్యాలను వెలికితెచ్చే ప్రశ్నల పట్టికను సిద్ధం చేయండి.**

**(ఇ) నిర్వహణ :**

విద్యార్థుల్లో ప్రశంసించే తత్వాన్ని పెంపొందించాలి. ప్రశంసించే విధానాన్ని తెలియజేయాలి. దీన్ని మొదట పూర్తి తరగతి కృత్యంగా నిర్వహించాలి. సూచనలు ఇవ్వాలి. తరవాత వ్యక్తిగత కృత్యంగానే అభివ్యక్తీకరించేట్లు చేయించాలి. ప్రశంసల్లోని మాధుర్యానుభూతిని వర్ణించి చెప్పాలి.

కుల, మత, లింగ, భాషా వర్గ భేదాలు లేకుండా మంచిని ప్రశంసించేట్లు చూడాలి. సంకుచిత భావాలకు దూరంగా, ఈర్ష్యాసూయలకు దూరంగా ఉండేట్లు చూడాలి. ప్రశంస అనేది ఒక ప్రోత్సాహమనే విషయాన్ని తెలియజెప్పాలి.

ఇతరులు రాసిన విషయాన్ని పరిశీలించి అంగీకారయోగ్యంకాని భావనలున్నట్లైతే చర్చద్వారా సరిదిద్దాలి. స్వీయరచన, సృజనాత్మకత అభ్యాసాల లాగే సరిదిద్దడం చేపట్టవచ్చు.

## VII. భాషాంశాలు

పాఠ్యపుస్తకంలో వచ్చే వివిధ రకాల మార్పులను సౌందర్యాన్ని, నియమాలను తెలియజెప్పడానికి భాషాంశాలు అవసరం.

ఈ భాషాంశాల్లో సంధులు, సమాసాలు, వాక్యభేదాలు, అలంకారాలు, ఛందస్సు మొదలయిన అంశాలన్ని ఉంటాయి. ప్రాథమిక స్థాయిలో భాషాభాగాలతో మొదలైన భాషాంశాలు ఉన్నత స్థాయి వచ్చేసరికి వాక్యాలు నిర్మాణాల్లో ఉండే తేడాతోపాటు, భాషకు సంబంధించిన వివిధ నియమాలను విద్యార్థులు అవగతం చేసుకుంటారు.



© SCERT not to be republished

**(అ) ఏం చేయగలగాలి?**

ఈ 'భాషాంశాలు' సామర్థ్యం ద్వారా విద్యార్థులు

- వాక్యనిర్మాణాల్లోని తేడాలను గమనించి వివిధ రకాల వాక్యాలు నిర్మించగలగాలి.
- తెలుగు, సంస్కృత సంధుల నియమాలను గుర్తించగలగాలి. ప్రయోగాల ద్వారా సూత్రం నిర్మించగలగాలి.
- సమాసాలను గుర్తించి, ఆయా సమాసాలకు సరైన ఉదాహరణలు ఇవ్వగలగాలి.
- పద్య / గద్యాల్లో ఉండే అలంకారాలను గుర్తించగలగాలి. అలంకారానికి సంబంధించిన లక్షణాలను చెప్పగలగాలి.
- ఛందోరీతులను తెల్సుకోవాలి. జాతి, ఉపజాతి, వృత్త పద్యాలకు సంబంధించిన లక్ష్యలక్షణ సమన్వయం చేయగలగాలి.

**(ఆ) స్వభావం :**

స్థూలంగా ఈ సామర్థ్యసాధన ప్రశ్నలు భాషాప్రయోగాన్ని అనుసరించి సూత్రీకరణ దిశగా ఉంటాయి.

అయితే నూతన పాఠ్యపుస్తకాల్లో ఇవి ప్రాయోగికంగా ఇవ్వడం జరిగింది. ఉదా:

- కింది పేరానుండి సామాన్య, సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలను గుర్తించి రాయండి. **(ప్రతిజ్ఞ)**
- కింది విగ్రహవాక్యాలను సమాసపదంగా మార్చండి. **(చిన్నప్పుడే)**
- కింద ఇచ్చిన పదాలకు వ్యుత్పత్త్యర్థాలను జతచేయండి. **(సముద్రలంఘనం)**
- కింది పాదాలు ఏ వృత్తాలకు సంబంధించినవో గుర్తించండి. **(సందేశం)**
- పాఠం చదవండి. కింద తెలిపిన సంధులకు సంబంధించిన ఉదాహరణలను వెతికి రాయండి. సూత్రాలు కూడా రాయండి. **(శాంతికాంక్ష)**
- పాఠంలోని సమాస పదాలు ఆధారంగా కింది పట్టికలోని ఖాళీగళ్ళను పూరించండి. **(ససేమిరా)**
- 7వ పద్యంలోని అలంకారాన్ని కనుక్కొని, పేరురాసి, లక్షణాలతో సరిపోల్చండి. **(ససేమిరా)**

ఈ ప్రశ్నల స్వభావాలు మామూలు రీతికి భిన్నంగా కనబడతాయి.

- పేరా నుండి విభిన్న వాక్యాలను ఏరి తీయడం.
- సమాస పదాలను కూర్చడం.
- ఛందోలక్షణాలను గుర్తించడం.
- సంధుల పేర్ల ద్వారా సంధిపదాలను గుర్తించడం.
- పాఠంలోని సమాస పదాలు ఆధారంగా అడిగిన ఖాళీని పూరించడం.
- పద్యంలోని అలంకారాన్ని లక్షణంతో సరిపోల్చడం మొదలయిన స్వభావాలు కనబడతాయి.

**భాషాంశ సంబంధ ప్రశ్నల్లోఉన్న కొత్త పోకడలున్న ప్రశ్నలను వెదకండి.**

**(ఈ) నిర్వహణ :**

ఈ సామర్థ్యాన్ని తరగతి కృత్యంగాను, వ్యక్తిగత కృత్యంగాను నిర్వహించాలి. ప్రతి విద్యార్థి సూత్ర నిర్మాణాన్ని సాధించగలగాలి. అందుకు ఉపాధ్యాయుడు విభిన్న ఉదాహరణలను ఉపయోగించుకోవచ్చు. నిత్యవ్యవహారంలోని వాక్యాలను, పదాలను కూడా వాడి విద్యార్థులచేత సామర్థ్య సాధన చేయవచ్చు. దీనికి కేటాయించిన పీరియడ్లలోనే ఈ అభ్యాసం జరగాలి. దీనిలో సులువు నుండి కఠినతవైపు వెళ్ళాలి.

విద్యార్థులకు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలి. విద్యార్థి స్వయంగా సాధించగలగాలి.

© SCERT not to be republished

## ప్రాజెక్ట్ పని

ఇది అనేక సామర్థ్యాలు సమ్మిళితమైన పని. ప్రతి పాఠంలో ఇచ్చిన ప్రాజెక్టుపనిని వ్యక్తిగత కృత్యంగానే నిర్వహించాలి. అవసరమైన చోట్ల మాత్రమే సమూహకృత్యంగా నిర్వహించేట్లు చూడాలి. ఐతే ఎలా చేయాలో, సూచనలు ఇవ్వాలి. ఏమేం చేయాలో స్పష్టంగా తెలపాలి.

ఇచ్చిన ప్రతి ప్రాజెక్ట్ పనిని తరగతి గదిలో ప్రదర్శించేట్లు చూడాలి. ఉత్తమ ప్రాజెక్టుపనులను ప్రశంసించాలి. పాఠ్య విషయబోధన పూర్తికాగానే అభ్యాసాలను ప్రారంభించకముందే ప్రాజెక్టుపనిని ఇంటిపనిగా ఇవ్వాలి. దీన్ని బట్టి సమయాన్ని దృష్టిలో పెట్టుకొని పదజాల కృత్యాలు నిర్వహించే రోజు లేదా స్వీయమూల్యాంకన కృత్యాలు నిర్వహించేటప్పుడు ప్రదర్శింపజేయాలి. చర్చ నిర్వహించాలి. పిల్లలు ఏమి నేర్చుకొన్నారో వ్యక్తిగతంగా నివేదిక రాయమనాలి.

## ముగింపు

పాఠ్యపుస్తకంలో అభ్యాసాలు చాలా కీలకమైనవి. వీటి సాధన అత్యవసరమనే విషయాన్ని గుర్తించాలి. వీటిద్వారానే సామర్థ్యాల సాధన జరుగుతుంది. ఏ పాఠం బోధించినా ఆ పాఠానికి కేటాయించిన పీరియడ్లలో ఎక్కువభాగం సుమారు 70% సమయాన్ని అభ్యాసాలకు కేటాయించాలి. విషయబోధన / వినడం / అవగాహనకు 30% సమయాన్ని కేటాయించుకోవాలి. అప్పుడే భాషాబోధన లక్ష్యాలు నెరవేరుతాయి.

© SCERT not to be republished

*పాఠశాల సామాజిక కేంద్రం. దీంట్లో సమానత్వపు విలువలు, సామాజిక న్యాయం, వైవిధ్యాల పట్ల గౌరవం, పిల్లల హక్కులు, పిల్లలకిచ్చే గౌరవం వంటివి ఇందులో ప్రతిబింబించాలి. ఈ విలువలను పాఠశాల దృక్కోణంలో ఉద్దేశపూర్వకంగా భాగం చేసి వాటి అమలుకు పునాదులు వేయాలి. పిల్లలు భద్రతాభావంతో, నిర్భయం ఉంటూ సమానత్వం, న్యాయమైన పరిపాలనతో, స్వేచ్ఛాపూరిత వాతావరణంలో భావవ్యక్తీకరణ చేయగలగడం, ప్రశ్నించడం వంటివి చేయడానికి ఉన్న వాతావరణాన్ని అనుకూల వాతావరణం అంటారు. దీనికై ఉపాధ్యాయులు ప్రత్యేక కృషిచేయాల్సిన అవసరం లేదు. పిల్లల పట్ల వివక్షత, అసమానత్వపు దృష్టి లేకుండా ఉంటే చాలు. బోధనాభ్యసన ప్రక్రియల్లో పాల్గొనేటప్పుడు పిల్లలు స్వేచ్ఛగా ప్రశ్నించేటట్లు, తోటిపిల్లలతో, ఉపాధ్యాయులతో సంభాషించేటట్లు తరగతి గదిని ఉపాధ్యాయుడు నిర్మించాలి. తరగతి గది భౌతిక స్వరూపం కూడా మారాలి. పిల్లలు చిన్నగ్రూపులుగా, పెద్దగ్రూపులుగా కూర్చొని వివిధ కృత్యాలు లేదా కథలు చెప్పుకోడానికి, చర్చించుకోడానికి, వ్యక్తిగతంగా చదవడం, రాయడం చేయడానికి, అందరూ సమావేశమై T.V., రేడియో కార్యక్రమాలు వీక్షించడానికి అనుకూలంగా తరగతి గదులు మార్పుచెందాలి.*

***– ఆం.ప్ర. రాష్ట్ర విద్యా ప్రణాళిక పరిధి పత్రం 2011***